క్లుప్తంగా

సన్మానం



భూపాలపల్లి రూరల్: పట్టణంలో సుగుణ దంత వైద్యశాల ఏర్పాటు చేసి పేదలకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహిస్తు డాక్టర్ పెంబర్తి సతీష్‌-పల్లవి దంపతులను జిల్లా ప్రజలకు విశేష సేవలు అందిస్తున్నారని భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా అధ్యక్షుడు కోల శ్యామ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో డాక్టర్ పెంబర్తి సతీష్‌-పల్లవి దంపతులను ఘనంగా సన్మానం చేశారు. గౌతమ బుద్ధుని జ్ఞాపికను అందజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ బౌద్ధ మహాసభ జిల్లా కోశాధికారి రామిల్ల రవి, జిల్లా నాయకులు బూడిద శ్రీనివాస్, సోత్కు సమ్మయ్య, ఇనుగాల కుమార్, బయ్యన మహేందర్, విజ్జారపు చరణ్, సుభాష్ తదితనులు పాల్గొన్నారు.

మరమ్మతు పనులు పూర్తిచేయాలి

చిట్యాల: మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి(సి) గ్రామంలోని పెద్ద చెరువు మరమ్మతు పనులు పూర్తి చేయాలని బీఆర్‌ఎస్ పార్టీ యూత్ టౌన్ అధ్యక్షుడు రమేశ్ అన్నారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ.. చెరువు కట్ట మరమ్మతుల కోసం రాష్ట్ర ప్రభుత్వం రూ.45 లక్షలు కేటాయించగా సగం పనులు మాత్రమే చేశారన్నారు. కట్టకు ఇరువైపులా ఉన్న పిచ్చి చెట్లను తొలగించకపోవడం వలన మూలమలుపు దగ్గర రైతులు పడే అవకాశం ఉందన్నారు. నాణ్యత ప్రమాణాలు పట్టించుకోకుండా గుత్తేదారు ఇష్టారాజ్యంగా పనులు చేస్తున్నాడని వాపోయారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కట్ట మరమ్మతు పనులు రైతులకు ఉపయోగపడేలా చేయాలన్నారు.

వాహనాల తనిఖీ



వెంకటాపురం(కె): మండల పరిధిలోని పాలెం గ్రా మ సమీపంలో ఎస్సై తిరుపతిరావు ఆధ్వర్యంలో పోలీసులు వాహనాల తనిఖీ నిర్వహించారు. మండల కేంద్రానికి చర్ల మండలం నుంచి వచ్చి వెళ్లే వా హనాలను క్షుణ్ణంగా తనిఖీ చేశారు. అనుమానిత వ్యక్తులు తారస పడితే వారి వద్ద నుంచి పూర్తిస్థాయి సమాచారాన్ని సేకరించి పంపిస్తున్నారు. సీఆర్‌పీఎ ఫ్ సిబ్బంది, సివిల్ పోలీసులు ఉన్నారు.

నివాళి



ఏటూరునాగారం: వరంగల్ జిల్లా సంగెం మండల కేంద్రంలోని జెడ్పీహెచ్‌ఎస్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న ఏటూరునాగారం గ్రామానికి చెందిన నాగుల రవీందర్ అనారోగ్యంతో మృతి చెందడం బాధాకరమని ప్రధానోపాధ్యాయుడు పి.రాము అన్నారు. నాగుల రవీందర్ అకాల మృత్యుపై తీవ్ర దిగ్భ్రాంతి తెలిపారు. ఆదివారం మృత దేహం వద్ద నివాళులర్పించారు. ఏళ్ల మధుసూదన్, ఉపాధ్యాయులు, దేవేందర్ రెడ్డి, కొమురయ్య, కె.ఈశ్వర్, రాజు పాల్గొన్నారు.

ప్రయాణం ప్రమాదం



పోచంపల్లి, దుంపిల్లపల్లి రోడ్డుకు ఇరువైపులా పిచ్చి మొక్కలు



మలుపు వద్ద ప్రమాదకరంగా బావి(ఇన్‌సెట్‌లో)

- రోడ్డుకు ఇరువైపులా పొదలు
- పట్టించుకోని అధికారులు

రేగొండ: రహదారికి ఇరువైపులా కంప చెట్లు కమ్మేయడంతో రోడ్డు సరిగా కనిపించక ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మండలంలోని దుంపిల్లపల్లి, భాగిర్థిపేట, గూడెపల్లితో పాటు ఆ పరిసర గ్రామాల్లో ప్రజలు నిత్యం పోచంపల్లి మీదుగా రేగొండ వెళ్తుంటారు. రోడ్డుకు ఇరువైపులా కంప చెట్లు ఉండటంతో తరుచూ కార్లు, ఆటోలు, ట్రాక్టర్లు, ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురై గాయాల పాలవుతున్నారు. రాత్రి వేళల్లో ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించకపోవడంతో వాహనదారులు అదుపుతప్పి కింద పడుతున్నారు. దుంపిల్లపల్లి వెళ్లే దారిలో మలుపు వద్ద రోడ్డు పక్కనే ఉన్న బావి చుట్టూ చెట్లు కప్పి ఉండటంతో ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయని వాహనదారులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి దారికి ఇరువైపులా ఉన్న కంప చెట్లను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

కొత్త వ్యక్తులు వస్తే సమాచారం ఇవ్వాలి



గొత్తికోయలతో మాట్లాడుతున్న ఎస్సై తాజొద్దీన్

ఏటూరునాగారం: గ్రామాల్లోకి కొత్త, అనుమానిత వ్యక్తులు వస్తే పోలీసులకు సమాచారం అందించాలని ఎస్సై తాజొద్దీన్ అన్నారు. మండలంలోని చింతలమోరి గ్రామాన్ని ఆదివారం పోలీస్ సిబ్బందితో కలిసి ఆయన సందర్శించి మాట్లాడారు. అపరిచిత వ్యక్తులకు ఆశ్రయం కల్పించవద్దని అన్నారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే చర్యలు తప్పవని హెచ్చరించారు. వర్షాకాలంలో వరదలు సంభవిస్తే తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. గూడెంలో నెలకొన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. పిల్లలను విద్యకు దూరంగా ఉంచకుండా పాఠశాలలలో చేర్పించాలని తెలిపారు. గూడెంలో ప్రజల ఆరోగ్య పరిస్థితి, గర్భిణుల, బాలింతల, వృద్ధుల సమాచారాన్ని తె లుసుకున్నారు. వర్షాకాలంలో వాగులు పొంగినప్పుడు సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని అన్నారు. పోలీస్ శాఖ ఎప్పుడు ప్రజారక్షణ ధ్యేయంగా ప్రజా సంక్షేమం కోసం నిరంతరం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో సివిల్, సీఆర్పీఎఫ్ పోలీసులు ధృవ, అజయ్, రామారావు పాల్గొన్నారు.

‘మన్‌కీ బాత్’ను వీక్షించిన నాయకులు



మన్‌కీబాత్ కార్యక్రమం వీక్షిస్తున్న నాయకులు

రేగొండ: మండల కేంద్రంలో రేగొండ, కొత్తపల్లిగోరి బీజేపీ మండలాల అధ్యక్షులు దాసరి తిరుపతి రెడ్డి, సురుగురి రాజేందర్ రెడ్డి ఆధ్వర్యంలో మాన్ కీ బాత్ కార్యక్రమాన్ని ఆ పార్టీ నాయకులు ఆదివారం వీక్షించారు. ఈ సందర్భంగా తిరుపతి రెడ్డి మాట్లాడుతూ.. మూడోసారి అధికారంలోకి వచ్చిన తర్వాత నిర్వహించిన మన్ కీ బాత్ కార్యక్రమంలో ప్రధాని మోదీ అమ్మ పేరుతో తాను ఒక మొక్కను నాటానని.. మీరు కూడా మొక్కను నాటాలని సూచించినట్లు తెలిపారు. మండలంలోని ప్రతి బీజేపీ కార్యకర్త తల్లి పేరుతో మొక్కను నాటాలని కోరారు. ఈ కార్యక్రమంలో కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు పోలుసాని తిరుపతి రావు, ఉపాధ్యక్షులు సరోత్తం రెడ్డి, మండల ప్రధాన కార్యదర్శి పెండల రాజు, నాయకులు కొడగాని రాకేష్, గుండెకారి అభిరామ్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



మల్హర్: ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు



చిట్యాలలో..

మల్హర్: మండల కేంద్రం తాడిచర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 1985–86 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకున్నారు. ఆత్మీయ పలకరింపులు, ఆలింగనాల నడుమ నాటి మధుర స్మృతులను నెమరేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఈ సందర్భంగా ఘనంగా సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు. పూర్వ విద్యార్థులందరూ ఒకేచోట చేరవడంతో సందడి నెలకొంది. ఇక నుంచి టచ్‌లో ఉండాలంటూ ఫోన్ నంబర్లు తీసుకోవడంతో పాటు ఈ మధుర జ్ఞాపకాలను తమ తమ సెల్‌ఫోన్లలో బంధించుకున్నారు.

చిట్యాలలో..

చిట్యాల: మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో చదువుకున్న 1995–96 బ్యాచ్‌కి చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం సమ్మేళన కార్యక్రమం నిర్వహించారు. పాఠశాలలో చదువుకున్న రోజులలో తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఘనంగా సన్మానించారు. పూర్వ విద్యార్థులు లింగమూర్తి, కోటి, చందర్, చక్రపాణి, శ్రీధర్, రవి, రఘుపతి, కుమారస్వామి, మాధవి, సనీత, సుభాషిని, పద్మ, భారతి, మాధవి, స్వరూప, మహేందర్, నరేష్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

‘దళితబంధు’ విడుదల చేయాలి

కాటారం: దళితబంధు పథకంలో భాగంగా ఎంపికైన లబ్ధిదారులకు సంబంధించిన నిధులను తక్షణమే విడుదల చేసి నిరుపేద దళితులకు న్యాయం చేయాలని బహుజన్ సమాజ్‌పార్టీ మండల అధ్యక్షుడు బొడ్డు రాజబాబు ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. దళితుల జీవితాల్లో వెలుగులు నింపాలనే ఉద్దేశ్యంతో గత ప్రభుత్వం దేశంలోనే ప్రతిష్టాత్మకంగా దళితబంధుకు శ్రీకారం చుట్టిందన్నారు. విధివిధానాలకు అనుగుణంగా పారదర్శకంగా లబ్ధిదారుల ఎంపిక జరిగిందని ఎన్నికల కోడ్ రావడంతో జిల్లా స్థాయిలో కలెక్టర్ల ఖాతాలో లబ్ధిదారుల నిధులు ఫ్రీజ్ అయినట్లు పేర్కొన్నారు. కాంగ్రెస్ అధికారంలోకి వస్తే రూ.12 లక్షల దళితబంధు ఇస్తామని హామీ ఇచ్చినట్లు తెలిపారు. గతంలో మంజూరైన దళితబంధు లబ్ధిదారులకు హామీ మేరకు పెంచిన నిధులు ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు.

రోడ్డుకు మరమ్మతులు



గుంతలను పూడ్చివేయిస్తున్న పోలీసులు

మహాముత్తారం: మండల కేంద్రం నుంచి యామన్‌పల్లి వెళ్లే ప్రధాన రహదారి గతంలో కురిసిన భారీ వర్షాలకు బొర్రవాగు వద్ద భారీ గుంతలు ఏర్పడ్డాయి. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఎస్సై మహేందర్‌కుమార్ ఆదివారం సొంత డబ్బులతో జేసీబీ ద్వారా గుంతలను పూడ్చి రహదారికి మర్మతులు చేపట్టారు. వాహనదారులు, గ్రామస్తులు ఎస్సై మహేందర్‌కుమార్‌కు కృతజ్ఞతలు

రేపు కమిటీ ఎన్నిక

కాళేశ్వరం: మహదేవపూర్ మండల కేంద్రంలో రేపు (మంగళవారం) ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం నూతన కమిటీని ఎన్నుకోనున్నట్లు ఆ సంఘం నాయకులు మేరుగు లక్ష్మణ్ ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. మండలంలోని గ్రామ గ్రామాన ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం పునర్నిర్మాణం చేయాలన్న సంకల్పంతో అంబేడ్కర్ యువజన సంఘం సీనియర్ నాయకులు లింగాల రామయ్య, మెరుగు లక్ష్మణ్‌ల ఆధ్వర్యంలో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని పేర్కొన్నారు. ఈ సమావేశానికి సంఘం జాతీయ, రాష్ట్ర, జిల్లా, మండల స్థాయి నాయకులు రానున్నారని తెలిపారు.

క్రీడా అభిమానుల ర్యాలీ



ర్యాలీ తీస్తున్న క్రీడాభిమానులు, క్రీడాకారులు

వెంకటాపురం(కె): క్రికెట్ టీ 20 ప్రపంచ కప్‌లో భారత్ విజయం సాధించడంపై హర్షం వ్యక్తం చేస్తు ఆదివారం మండల కేంద్రంలో క్రీడాకారులు, క్రీడాభిమానులు మోటర్ సైకిల్ ర్యాలీ నిర్వహించారు. స్థానిక గెస్టు హౌస్ సెంటర్‌లో ప్రారంభమై వేప చెట్టు సెంటర్ మీదుగా శివాలయం సెంటర్, జగదాంబా సెంటర్ దుర్గమ్మ గుడి సెంటర్ వరకు జాతీయ జెండాలతో ర్యాలీ చేపట్టారు.

విద్యారంగాన్ని పట్టించుకోని ప్రభుత్వం



నిరసన తెలుపుతున్న ఎస్‌ఎఫ్‌ఐ నాయకులు

శాయంపేట : తెలంగాణ రాష్ట్రంలో ఉన్నటువంటి విద్యారంగ సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా ప్రధాన కార్యదర్శి మంద శ్రీకాంత్ సీఎం రేవంత్‌రెడ్డిపై మడ్డిపడ్డారు. రాష్ట్ర క్యాబినెట్‌లో విద్యాశాఖ మంత్రిని వెంటనే నియమించి విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని ఆదివారం మండల కేంద్రంలోని అంబేడ్కర్ విగ్రహం దగ్గర ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడు నెలలు గడుస్తున్నా రాష్ట్రంలో నెలకొన్న విద్యారంగ సమస్యలపై సీఎం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం కూడా ప్రజావ్యతిరేక విధానాలను అనుసరిస్తుందన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ సభ్యులు మడికొండ ప్రశాంత్, బొజ్జ హేమంత్ తదితరులు ఉన్నారు.

ప్రైవేట్ పాఠశాలల దోపిడీని అరికట్టాలి

భూపాలపల్లి అర్బన్: జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలల్లో దోపడీని అరికట్టాలని సేవాలాల్ విద్యార్థి సేనా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గుగులోత్ సంతోష్ ఆదివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. జిల్లాలో ప్రైవేట్ పాఠశాలల యాజమన్యాలు విచ్చలవిడిగా పాఠ్య పుస్తకాలు, యూనిఫామ్‌లు విక్రమిస్తున్నారని తెలిపారు. విద్యార్థుల తల్లిదండ్రుల నుంచి అందినకాడికి దోచుకుంటున్నారని ఆరోపించారు. తల్లిదండ్రులను బలహీనతలను ఆసరాగా చేసుకోని ప్రైవేట్ పాఠశాలలు నిబంధనలకు విరుద్ధంగా వేలాది రూపాయాలు పాఠశాలల ఫీజులను వసూలు చేస్తున్నారని తెలిపారు. జిల్లా విద్యాశాఖ అధికారులు తనిఖీ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సీఎం రాక.. జిల్లా ప్రజల అదృష్టం

పరకాల: సీఎం రేవంత్‌రెడ్డి తన పిలుపును ఆస్వాదించి రావడం జిల్లా ప్రజల అదృష్టంగా భావిస్తున్నట్లు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాశ్‌రెడ్డి అన్నారు. ఎంఓయూతో కుదుర్చుకున్న కంపెనీలు మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ఆయా కంపెనీలు మూడు నెలల్లో ప్రారంభించి స్థానికంగా ఉన్న వేలాది మంది నిరుద్యోగులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించే అవకాశం లభించినట్లు అవుతుందని ఆయన అభిప్రాయపడ్డారు. ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వరంగల్ ఉమ్మడి జిల్లాలో పెద్ద పరిశ్రమ మెగా టెక్స్‌టైల్ పనులను పరిశీలించిన సీఎం ఎంఓయూ కుదుర్చుకున్న పలు కంపెనీల ప్రతినిధులతో మాట్లాడినట్లు తెలిపారు. ఒప్పంద ప్రకారం మూడు నెలల్లో పనులు ప్రారంభించాల్సిన అవసరం ఉందని, ఆయా కంపెనీల్లో 80 శాతం స్థానిక నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించాలని స్పష్టం చేయడం జరిగిందన్నారు.

విద్యాశాఖ మంత్రిని నియమించాలి

కాళేశ్వరం: తెలంగాణ ప్రభుత్వం విద్యాశాఖకు మంత్రిని వెంటనే నియమించాలని బీజేపీ నాయకుడు పోటు శ్రావన్‌కుమార్‌రెడ్డి ఆదివారం ఆయన ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. విద్యాసంస్థలు ప్రారంభమైన విద్యశాఖకు మంత్రిని నియమించకపోవడం తెలంగాణ సీఎం పరిపాలన లోపమన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని విద్యాశాఖ మంత్రి నియమించాలని కోరారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఆరు నెలలు దాటిన విద్యాశాఖకు మంత్రిని నియమించకపోవడం ఎంతవరకు సమంజసం అని ప్రశ్నించారు. విద్యార్థులకు దిశా నిర్దేశం చేయాల్సిన శాఖకు మంత్రి లేకపోవడం వల్ల సమయ అనుకూలంగా నిర్ణయాలు తీసుకోలేకపోతున్నారని వెల్లడించారు.

మట్టి జారుతోంది!



మట్టి జారడంతో ఏర్పడుతున్న కాల్వలు



కొంగాల వాగు బ్రిడ్జికి దగ్గరలో..

- రివిట్‌మెంట్ చేయని కాంట్రాక్టర్
- ఇంకా పూర్తికాని రహదారి పనులు
- భారీ వర్షం పడితే అంతే సంగతులు

వాజేడు: మండల పరిధిలోని వాజేడు నుంచి గుమ్మడిదొడ్డి వరకు ప్రధానమంత్రి గ్రామీణ సడక్ యోజన పనుల్లో భాగంగా రహదారి పనులు చేపట్టారు. రెండు వంతెనలను నిర్మించిన తర్వాతే రహదారికి కంకర, చిప్స్ వేసి వదిలేశారు. రహదారి పనులు ఇంకా పూర్తి కాలేదు. చిన్న వర్షాలకే రహదారి నిర్మాణనికి పోసిన కంకర, మట్టి జారిపోతోంది. రహదారికి పలు చోట్ల కాలువలు ఏర్పడుతున్నాయి. దీంతో రహదారి మనుగడపై ప్రజల్లో సందేహాలు నెలకొన్నాయి. పూర్తి స్థాయిలో పనులను పూర్తి చేయలేదు. ఈ పనులను ఎప్పుడు పూర్తి చేస్తారో కూడా తెలియని దుస్థితి.

రివిట్‌మెంట్ చేయలేదు..

రహదారిని వేసిన కాంట్రాక్టర్ ఎత్తైన ప్రదేశంలో రోడ్డు మట్టి కిందకు జారకుండా రివిట్‌మెంట్ చేయాల్సి ఉంటుంది. కాని నేటి వరకు సదరు కాంట్రాక్టర్‌కు ఆ ఊసే లేదు. దీంతో చిన్న పాటి వర్షానికే రహదారికి పోసిన మట్టి కిందకు జారుతుంది. భారీ వర్షాలు కురిస్తే రహదారికి పోసిన మట్టి ఎక్కువగా జారిపోయి రహదారిపై కాలువలు ఏర్పడే అవకాశం ఉంది. అదే జరిగితే ప్రయాణం కూడా కష్టంగా మరుతుంది. కాంట్రాక్టర్ రహదారి పనులను పూర్తి చేయక పోగా కనీసం ఇరువైపులా రాయితో కట్టడం కూడా చేయలేదు. భారీ వర్షలు కురిస్తే సమీపంలోని కొంగాల వాగు నుంచి వరద ఉధృతి భారీ ఎత్తున ఉంటుంది. దీంతో రహదారికి పోసిన మట్టి కొట్టుకుపాయే అవకాశం ఉంది. రహదారి నుంచి జారిన మట్టి రైతుల చేలల్లోకి చేరి రైతులు వ్యవసాయం చేయనికి ఇబ్బందికరంగా ఉంటుంది.



మట్టి జారడంతో ఏర్పడిన గుంత

బియ్యం అందజేత



బియ్యం అందజేస్తున్న నాయకులు

కన్నాయిగూడెం: మండల పరిధిలోని బుట్టాయిగూడెం గ్రామానికి చెందిన కుమ్మరి మల్లయ్య ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి ఆదివారం జేఎల్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ అధ్యక్షుడు రామరాజు, బీజేపీ మండల కార్యదర్శి కుమ్మరి సత్యం, దళిత మోర్చా మండల అధ్యక్షుడు లక్ష్మయ్య ఉన్నారు.

వ్యక్తికి గాయాలు



గాయాలపాలైన రాజు

కాటారం: విద్యుత్ కనెక్షన్ ఇవ్వడానికి స్తంభం ఎక్కిన ఓ ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ విద్యుత్‌షాక్‌కు గురై కిందపడి తీవ్రగాయాలపాలైన సంఘటన మండల కేంద్రంలో ఆదివారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్తే.. దుర్గం రాజు అనే ప్రైవేట్ ఎలక్ట్రిషియన్ ఓ రైతుకు సంబంధించిన విద్యుత్ మోటర్ కనెక్షన్ ఇవ్వడం కోసం స్థానిక విద్యుత్ లైన్‌మెన్‌కు సమాచారం అందించారు. సదరు లైన్‌మెన్ సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరా నిలిపివేయడం కోసం అనుమతి తీసుకొని రాజుకు పని చేసుకోమని సూచించారు. దీంతో రాజు విద్యుత్ స్తంభం ఎక్కి జంపర్లకు విద్యుత్ తీగలు చుడుతుండగా ఆకస్మాతుగా విద్యుత్ సరఫరా కావడంతో షాక్‌కు గురైన రాజు స్తంభంపై నుంచి ఎగిరి కిందపడ్డాడు. చెట్లపొదలపై పడటంతో రాజు తీవ్రగాయాలపాలయ్యాడు. గమనించిన స్థానికులు కుటుంబ సభ్యులకు సమాచారం అందించి చికిత్స నిమిత్తం మహదేవపూర్ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రాజు ఛాతి భాగంలో, కాళ్లు, చేతులపై తీవ్ర గాయాలైనట్లు వైద్యులు గుర్తించారు. ఈ విషయమై ట్రాన్స్‌కో ఏఈఈ మేఘనాథ్‌ను వివరణ కోరగా లైన్‌మెన్ ద్వారా సరఫరా విరామం కోరినట్లు తెలిసిందని ఈ సంఘటనపై పూర్తి విచారణ జరుపుతున్నట్లు పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో గేదె మృతి



మృతి చెందిన గేదె

కాళేశ్వరం: రెండు ఇనుప టేలాల మధ్యలో ఇరుక్కొని విద్యుదాఘాతంతో గేదె మృతి చెందిన సంఘటన మహదేవపూర్ మండలం కాళేశ్వరం ఆదివారం చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.. కాళేశ్వరంలోని రవీందర్‌కు చెందిన గేదె ఉదయం ఇంట్లో నుంచి మేతకు వెళ్లింది. కాగా, టేలాల మధ్యలో నుంచి చెరువులోకి వెళ్లేందుకు ప్రయత్నించింది. అప్పటికే ఓ టేలాకు విద్యుత్ వైర్ ఎర్త్ తాకి ఉండటంతో గేదె షాక్ గురై ఇరుక్కొని మృతి చెందింది. గేదె విలువ సుమరు రూ.40వేలు విలువ ఉంటుందని బాధితుడు తెలిపాడు. ఎన్పీడీసీఎల్ అధికారులు తమను ఆదుకోవాలని కోరాడు.